ప్రజాస్వామ్యానికి మేలు : ధర్మాన

శ్రీకాకుళం : ఈ నెల 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో పాల్గొన్న నియోజకవర్గ ఓటర్లకు శ్రీకాకుళం నియోజకవర్గ వైసిపి అభ్యర్థి, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. పెద్ద సంఖ్యలో ఓటర్లు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి మేలు అని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన గొప్ప హక్కు ఓటు అని, దాన్ని ప్రజలు భారీ సంఖ్యలో వినియోగించుకోవడం అభినందనీయమన్నారు. అధికారులూ తమ విధులను సక్రమంగా నిర్వర్తించి పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించే కృషి చేశారని ప్రశంసించారు. అందరి సహకారంతో నియోజకవర్గంలో పోలింగ్ సజావుగా సాగిందని, ప్రజలు స్వచ్ఛందంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. ఇది భవిష్యత్‌కు శుభ సూచకమని పేర్కొన్నారు.

విజయం వరించేదెవరిని..?

- ఓటింగ్ శాతం పెరుగుదల తమకే అనుకూలమంటున్న టిడిపి కూటమి
- పెరిగిన మహిళా ఓటింగ్‌తో విజయంపై వైసిపి ధీమా
- గణనీయమైన ఓటు షేర్ సాధిస్తామంటున్న ఇండియా వేదిక

పోలింగ్ సరళి ఆధారంగా వైసిపి, టిడిపి కూటమి తమకు వచ్చే ఓట్లు, సీట్లపై లెక్కలు వేసుకుంటున్నాయి. సర్వేలపై ఎన్నికల సంఘం జూన్ ఒకటో తేదీ వరకు నిషేధం విధించడంతో, అవి కూడా బహిర్గతం కాలేదు. దీంతో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి, ఎంపీ స్థానాన్ని ఎవరు కైవసం చేసుకుంటారన్న చర్చ సాగుతోంది. జిల్లాలో పోలింగ్ శాతం తమకు అనుకూలంగా ఉండడంతో, అత్యధిక స్థానాల్లో గెలుపు సాధిస్తామంటూ టిడిపి లెక్కలు వేసుకుంటోంది. మహిళల ఓటింగ్ శాతం గణనీయంగా పెరగడంతో, ఎక్కువ స్థానాల్లో తామే గెలవబోతున్నామంటూ వైసిపి ధీమా వ్యక్తం చేస్తోంది. ఎంపీ స్థానంతో సహా అన్ని అసెంబ్లీ స్థానాల్లో గణనీయమైన ఓటు షేర్ సాధిస్తామని ఇండియా వేదిక విశ్వాసం వ్యక్తం చేస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలో ఈసారి గట్టి పోటీ నెలకొంది. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, టిడిపి అభ్యర్థి గొండు శంకర్ మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీ సాగింది. ఇక్కడ 70.21 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ శాతం తమకు అనుకూలంగా ఉందని ధర్మాన అనుచరులు భావిస్తున్నారు. గార మండలంలో తమకు ఈసారి మెజార్టీ వస్తుందని, శ్రీకాకుళం రూరల్‌లో గణనీయంగా ఓట్లు సాధిస్తామని వైసిపి నాయకులు చెప్తున్నారు. శ్రీకాకుళం నగరంలో తమకు అనుకూలంగా కొంత క్రాసింగ్ ఓటింగ్ సాగిందని, కచ్చితంగా విజయం సాధిస్తామని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గమంతటా తమకు అనుకూలంగా ఓటింగ్ జరిగిందని, తమ అభ్యర్థి గొండు శంకర్ గెలుస్తారని ఆయన అనుచరులు చెప్తున్నారు.

నరసన్నపేటలో పోటాపోటీ

నరసన్నపేటలో పోటాపోటీ నెలకొంది. ఇక్కడ 80.44 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముందు వరకు తమకు కొంత కష్టంగా ఉన్నా, ఓటింగ్ సరళి బట్టి తాము విజయం సాధిస్తామని ధర్మాన కృష్ణదాస్ అనుచరులు చెప్తున్నారు. టిడిపికి ఉన్న బలమైన కేడర్, అన్ని మండలాల నుంచి భారీగా చేరిన వైసిపి కేడర్ గట్టిగా టిడిపికి పనిచేసిందని, తాము తేలిగ్గా విజయం సాధిస్తామని టిడిపి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

టెక్కలి ఎవరు గట్టెక్కుతారో?

రాష్ట్రంలో ప్రతిష్టాత్మక నియోజకవర్గాల్లో టెక్కలి నియోజకవర్గం ఒకటి. టిడిపి నుంచి ఆ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, వైసిపి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ పోటీ పడుతున్నారు. ఇక్కడా టిడిపి, వైసిపి మధ్య హోరాహోరీ పోరు సాగింది. నియోజకవర్గంలో 80.51 శాతం నమోదైంది. పోలింగ్ సరళి తమకు అనుకూలంగా ఉందని, తామే గెలుస్తామని అచ్చెన్నాయుడు అనుచరులు గట్టిగా చెప్తున్నారు. టెక్కలిలో ఈసారి ఎలాగైనా వైసిపి జెండా ఎగురవేయబోతున్నామని దువ్వాడ అనుయాయులు అంటున్నారు.



పలాసలో గెలుపెవరిదో..?

పలాసలో పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, టిడిపి అభ్యర్థి గౌతు శిరీష మధ్య నువ్వానేనా అన్నట్లు పోరు సాగింది. నియోజకవర్గంలో 76.42 శాతం మేర పోలింగ్ నమోదైంది. పోలింగ్‌కు రెండు రోజుల ముందు వరకు మంత్రి అప్పలరాజుదే గెలుపు అన్న చర్చ సాగింది. పోల్ మేనేజ్‌మెంట్‌లో కొంత వెనుకబడ్డామన్న అభిప్రాయం పార్టీ శ్రేణుల నుంచి వినిపిస్తోంది. అయినా స్వల్ప మెజార్టీతోనైనా గట్టెక్కుతామని వారు చెప్తున్నారు. ఇదే సమయంలో పోలింగ్‌కు రెండు రోజుల ముందు పక్కాగా ప్లాన్ చేసి పనిచేయడం, పోల్ మేనేజ్‌మెంట్ విషయంలో విజయవంతం కావడంతో, తాము గెలుస్తామని గౌతు శిరీష అనుచరగణం చెప్తోంది.

ఇచ్ఛాపురంలో నువ్వానేనా?

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో హోరాహోరీ పోరు నెలకొంది. టిడిపి నుంచి బెందాళం అశోక్, వైసిపి నుంచి పిరియా విజయ నువ్వా నేనా అన్నట్లు పోటీ పడ్డారు. ఇక్కడ పోలింగ్ శాతం 70.56 గా నమోదైంది. ఓటింగ్ సరళి బట్టి తామే గెలుస్తామని వైసిపి అభ్యర్థి పిరియా విజయ ధీమాగా ఉన్నారు. పార్టీ కేడర్, జనసేన కలిసికట్టుగా పనిచేసిందని, తామే విజయం సాధించనున్నామని బెందాళం అశోక్ అనుచరులు బలంగా నమ్ముతున్నారు.

ఆమదాలవలసలో ఎవరి ధీమా వారిదే

ఆమదాలవలస నియోజకవర్గం నుంచి వైసిపి తరుపున శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ బరిలో ఉన్నారు. ఇక్కడ 81.42 శాతం పోలింగ్ నమోదైంది. భారీగా పోలింగ్ శాతం నమోదు కావడంతో తమ గెలుపు ఖాయమని కూన అనుచరులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటింగ్ సరళి బట్టి స్వల్ప మెజార్టీతోనైనా గట్టెక్కుతామని తమ్మినేని సీతారాం అనుచరులు చెప్తున్నారు.

ఎచ్చెర్లలో హోరాహోరీ

ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి వైసిపి తరుపున గొర్లె కిరణ్‌కుమార్, కూటమి నుంచి బిజెపి అభ్యర్థి ఎన్.ఈశ్వరరావు బరిలో నిలిచారు. ఇక్కడ జిల్లాలోనే అత్యధికంగా 83.28 శాతం పోలింగ్ నమోదైంది. ఓటింగ్ సరళి బట్టి తాము కచ్చితంగా గెలుస్తామని ఈశ్వరరావు అనుచరులు గట్టిగా చెప్తున్నారు. పోలింగ్ సరళి తమకు అనుకూలంగా సాగిందని, తాము విజయం సాధించడం ఖాయమని కిరణ్‌కుమార్ అనుయాయులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పార్లమెంట్‌లో అడుగు పెట్టేదెవరో..?

శ్రీకాకుళం ఎంపీ స్థానం విషయంలో టిడిపి అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వైసిపి అభ్యర్థి పేరాడ తిలక్ మధ్య గట్టి పోటీ నెలకొంది. ఓటింగ్ సరళి టిడిపికి అనుకూలంగా సాగిందని రామ్మోహన్ నాయుడు అనుచరులు చెప్తున్నారు. జిల్లాలో అత్యధిక సీట్లలో టిడిపి విజయం సాధించే అవకాశాలున్నాయని, దీంతో ఎంపీ సీటును అవలీలగా గెలుచుకుంటామని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మహిళా ఓటర్లు, సామాజిక సమీకరణాలు తమకు కలిసొచ్చాయని, తాము గెలిచి తీరుతామని తిలక్ అనుచరులు గట్టిగా చెప్తున్నారు.



నేటి నుంచి ఇఎపిసెట్

- ఆన్‌లైన్‌లోనే కామన్ ఎంట్రన్స్ పరీక్ష
- 25 శాతం ఇంటర్ మార్కుల వెయిటేజీ
- 16, 17 తేదీల్లో మెడికల్, అగ్రికల్చర్, వెటర్నరీ
- 18 నుంచి 23 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు కామన్ ఎంట్రన్స్ టెస్టు గురువారం మొదలు కానుంది. ఈ పరీక్షలు ఈనెల 23వ తేదీ వరకు జరుగనున్నాయి. పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈసారి పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులకు ఇంటర్ మార్కుల్లో 25 శాతం వెయిటేజీ ఉంటుంది. ఇంజినీరింగ్ (బిటెక్), బయో టెక్నాలజీ (బిటెక్ డైరీ టెక్నాలజీ), బిటెక్ (ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) బిఎస్‌సి అగ్రికల్చర్, బిఎస్‌సి హార్టీకల్చర్, బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండ్రీ, బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీ సైన్స్, బిఫార్మసీ అండ్ ఫార్మడీ సీట్లు భర్తీ చేస్తారు. అందులో భాగంగా 16, 17 తేదీల్లో మెడికల్ విభాగం, 18 నుంచి 23వ తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగంగా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు.

పరీక్ష విధానం

ఇఎపిసెట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. మొత్తం 180 ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో గుర్తించాలి. పరీక్ష సమయం మూడు గంటలు. ప్రశ్నాపత్రం ఇంగ్లీష్, తెలుగు భాషల్లో ఉంటుంది. నెగిటివ్ మార్కులు ఉండవు. ఇంజినీరింగ్‌లో మార్కుల కేటాయింపు (మొత్తం 160) లెక్కల్లో 80, భౌతికశాస్త్రం 40, రసాయనశాస్త్రం 40 మార్కులు ఉంటాయి. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోర్సుల్లో మొత్తం 160 మార్కులకు గానూ బోటనీ 40, జువాలజీ 40, భౌతికశాస్త్రం 40, రసాయనశాస్త్రం 40 మార్కులను విభజించారు.

ఇంజినీరింగ్ సిలబస్

గణితంలో ఆల్జీబ్రా, ట్రిగనోమెట్రీ, వెక్టార్ ఆల్జీబ్రా, ప్రాబబులిటీ, కో-ఆర్డినేట్ జామెట్రీ, కాల్కులస్, చాఫర్సు, ఫార్ములాలు, సినాప్సిస్, స్టాండర్డు రిజల్ట్స్‌పై పట్టు సాధించడంతో పాటు ఫార్ములాలు గుర్తుంచుకోవాలి. వేగం, కచ్చితత్వం ఉంటేనే అత్యధిక ప్రశ్నలు స్కోర్ చేయడానికి వీలుంటుంది.

భౌతికశాస్త్రం (ఫిజిక్స్) లో ఫిజికల్ వరల్డ్, యూనిట్స్ అండ్ మెజర్మెంట్స్, మోషన్ ఇన్ ఏ స్ట్రెయిట్, లాస్ ఆఫ్ మోషన్, ఆసిలేషన్స్, గ్రావిటేషన్స్, మెకానికల్ ప్రాపర్టీస్ ఆఫ్ సాలిడ్స్, థర్మల్ ప్రాపర్టీస్ ఆఫ్ మేటర్, థర్మో డైనమిక్స్, కైనటిక్ థియరీ, వేవ్స్ , రేఆప్టిక్స్, ఎలక్ట్రిక్ ఛార్జెస్ అండ్ ఫీల్డు, మాగ్నటిజమ్ వంటి వాటిలో ప్రాబ్లమ్స్ ఎక్కువ సాధన చేయాలి. హీట్ అండ్ థర్మో డైనమిక్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తుంటాయి. వర్కు ఎనర్జీ పవర్, మావింగ్ ఛార్జెస్ అండ్ మాగ్నటిజం ఛాప్టర్ల నుంచి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంటుందని అధ్యాపకులు చెపుతున్నారు.

రసాయనశాస్త్రం (కెమిస్ట్రీ)లో ఆటమిక్ స్ట్రక్చర్, క్లాసిఫికేషన్ ఆఫ్ ఎలిమెంట్స్, కెమికల్ బాండింగ్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, హైడ్రోజన్ అండ్ ఇట్స్ కాంపౌండ్స్, పాలిమర్స్, బయోమాలిక్యుల్స్, బ్లాక్ ఎలిమెంట్స్, సాలిడ్ స్టేట్, సొల్యూషన్స్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, కెమికల్ కైనటిక్స్, హైడ్రోకార్బన్స్, హాలో కాంపౌండ్లుగా విభజించి విద్యార్థులు చదవాల్సి ఉంటుంది. బోటనీలో డైవర్సీ టీ ఇన్ ద లివింగ్ వరల్డ్, మార్ఫాలజీ, రీప్రొడక్షన్ ఇన్‌ప్లాంట్స్, ప్లాంట్ సిస్టమాటిక్స్, సెల్ స్ట్రక్చ ర్ అండ్ ఫంక్షన్, ప్లాంట్ సిస్టమాటిక్స్, ప్లాంట్ఫిజియాలజీ, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, ప్లాంట్స్, మైక్రోబ్స్ అండ్ హ్యూమన్ వెల్ఫేర్ అంశాలపై విద్యార్థులు ఎక్కువ దృష్టి సారించాలని అధ్యాపకులు చెప్తున్నారు.

జువాలజీ సబ్జెక్టులో డైవర్సిటీ ఆఫ్ లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ యానిమెల్స్ , యానిమెల్ డైవర్సిటీ 1, 2, బయాలజీ ఇన్ హ్యూమన్ వెల్ఫేర్, పెరిప్లాంటా అమెరికా, హ్యూమన్ ఎనాటమీ అండ్ ఫిజియాలజీ 1, 2, 3, 4, హ్యూమన్ రీ ప్రొడక్షన్, జెనిటిక్స్, ఆర్గానిక్ ఎవల్యూషన్, అప్లైడ్ బయాలజీపై పట్టు ఉండాలి.

సమయపాలన ముఖ్యం

ఇఎపిసెట్‌లో మొత్తం 160 ప్రశ్నలు ఉంటాయి. వీటిని ఆన్‌లైన్‌లో 180 నిమిషాల్లో రాయాల్సి ఉంటుంది. వేగం, కచ్చితత్వం అవసరం. రెండో సంవత్సరం సిలబస్ పైనే ఎక్కువ దృష్టిపెట్టాలి. ఎక్కువ ప్రశ్నలు వచ్చే ఛాప్టర్లను గుర్తించి, వాటికి అనుగుణంగా మొదటి, రెండో సంవత్సరానికి సమ ప్రాధాన్యం ఇస్తూ సాధన చేయాలి. పరీక్షకు వెళ్లే ముందు కీలకమైన అంశాలు మరోసారి వేగంగా పరిశీలించుకోవాలి. ఇంతవరకు రాసుకున్న ముఖ్యమైన నోట్సు, ఫార్ములాలు, ముఖ్యాంశాలను గుర్తుంచుకోవాలి. ఆరోగ్యం కూడా జాగ్రత్తగా చూసుకోవాలి. ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజ్ ఉందన్న విషయాన్ని గుర్తించుకొని జాగ్రత్తగా పరీక్ష రాయాలి.

మూడు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరిధిలోని రాజాం జిఎంఆర్ ఐటి ఇంజినీరింగ్ కళాశాల, ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీస్, టెక్కలిలో ఉన్న ఐతమ్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక ఉన్నత విద్యామండలి పర్యవేక్షణలో జరుగుతున్న ఈ పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్‌పి రాధిక

స్ట్రాంగ్‌రూమ్ భద్రతా ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ భద్రతా ఏర్పాట్లను స్థానిక శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్‌పి జి.ఆర్ రాధిక బుధవారం పరిశీలించారు. స్ట్రాంగ్‌రూముల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల కేంద్ర పోలీస్ బలగాల గార్డు, జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్ గార్డు, సివిల్ పోలీస్ బందోబస్తును పరిశీలించి పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌కి నలువైపులా పటిష్ట భద్రతా ఏర్పాట్లు, నిరంతరం సిసి కెమెరాల పర్యవేక్షణపై ఆరా తీశారు. నిరంతరం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తనిఖీ అధికారులు నిరంతరం పహారాను తనిఖీ చేయాలన్నారు.

ఎన్నికల ఖర్చుపై లెక్కలు పక్కా

లేకుంటే అనర్హత వేటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. నామినేషన్ ప్రక్రియ నుంచి ప్రచారం పూర్తయ్యే వరకు అయిన ఎన్నికల ఖర్చును అభ్యర్థులు పక్కాగా చూపాల్సిందే. ఫలితాలు వెల్లడయ్యే లోపు వీటిని అభ్యర్థులు అప్పగించాల్సి ఉంటుంది. శాసనసభ ఎన్నికలకు ఎంత ఖర్చు చేయాలి, లోక్‌సభ ఎన్నికలకు ఎంత ఖర్చు చేయాలన్నది ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 19లో వివరించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న అభ్యర్థి వ్యయ పరిమితి రూ.40 లక్షలుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. అభ్యర్థులు చేసే ఖర్చుపై వివరాలను ఎప్పటికప్పుడు షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో నమోదు చేశారు. నిర్ణీత వ్యయ పరిమితికి మించి ఒక్క రూపాయి ఖర్చు దాటినా, అందుకు సంబంధించిన లెక్కలను సరైన ఆధారాలతో సమర్పించకున్నా, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 10ఎ ప్రకారం పోటీ చేసిన వ్యక్తి అభ్యర్థిత్వాన్ని ఎన్నికల సంఘం రద్దు చేసే అవకాశం ఉంటుంది.

దీంతోపాటు వచ్చే మూడేళ్ల పాటు స్థానిక, శాసనసభ ఎన్నికలతో సహా ఏ ఎన్నికల్లోనూ పోటీ చేసే అవకాశం లేకుండా అనర్హత వేటు వేస్తుంది. వ్యయ పరిశీలకులు, జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ఈ గణాంకాలను పరిశీలిస్తారు. దేనికి ఎంత ఖర్చు చేయాలో గతంలో ఎన్నికల సంఘం ప్రకటించింది. దాని ఆధారంగానే లెక్కలు చూపాల్సి ఉంటుంది.

15 వేల మెజార్టీ ఖాయం

వైసిపి టెక్కలి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్

మాట్లాడుతున్న దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

టెక్కలి నియోజకవర్గంలో వైసిపి 15 వేల మెజార్టీతో గెలుస్తుందని ఆ పార్టీ టెక్కలి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో మళ్లీ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. స్థానిక ఒక విద్యాసంస్థ ఆవరణలో బుధవారం నిర్వహించిన వైసిపి కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు లబ్ధి పొందిన వారు ఎండను కూడా లెక్క చేయకుండా ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. ఈసారి టెక్కలి నియోజకవర్గ ఎమ్మెల్యేగా తాను, పార్లమెంట్ సభ్యునిగా పేరాడ తిలక్ అధిక మెజార్టీతో గెలుస్తామన్న నమ్మకం కలిగిందన్నారు. సమావేశంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు నూక సత్యరాజు, వైస్ ఎంపిపిలు దుక్క రోజారామకృష్ణ, బోయిన నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, వైసిపి నాయకులు అన్నెపు రామారావు, బొడ్డు అప్పన్న, గడ్డవలస నాగభూషణరావు, సంపతిరావు హేమసుందరరాజు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో చోరీ

స్కూటీ డిక్కీలో నుంచి రూ.3.50 లక్షలు అపహరణ

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

పట్టణంలోని దాసన్నపేట వద్ద సినీ ఫక్కీలో బుధవారం చోరీ జరిగింది. స్కూటీ డిక్కీలోని రూ.3.50 లక్షలు గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. వివరాల్లోకి వెళ్తే... దాసన్నపేటలో నివాసం ఉంటున్న సింగంశెట్టి శ్రీను బియ్యం వ్యాపారం చేస్తున్నాడు. మధ్యాహ్నం భోజనం అనంతరం ఇంటి పక్కనే ఉన్న యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంకులో రూ.3.50 లక్షల నగదును విత్ డ్రా చేసి చేసి, తన స్కూటీలోని డిక్కీలో పెట్టి తాళం వేశాడు. తన షాపునకు వెళ్లి అక్కడ స్కూటీని పార్కింగ్ చేశాడు. షాపులో బ్యాగులు తీసుకుని పది నిమిషాల తర్వాత స్కూటీ వద్దకు వచ్చేసరికి డిక్కీ తెరిచి ఉంది. అందులో పెట్టిన నగదు లేకపోవడంతో, లబోదిబోమంటూ కేకలు వేశాడు. చుట్టుపక్కల వారు వచ్చి పరిసరాలను పరిశీలించారు. అనంతరం సమీపంలోని సిసి కెమెరాను పరిశీలించారు. బైక్‌పై ఒక బాలుడు వచ్చి స్కూటీ డిక్కీని ఓపెన్ చేసి నగదును అపహరించినట్లు రికార్డు అయింది. ఆ నగదుతో బాలుడు ఒడిశా వైపు వెళ్లినట్లు స్థానికులు చెప్తున్నారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ ఎస్ఐ సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

డబ్బులు పెట్టిన బాధితుని స్కూటీ

దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎస్‌పి శృతి

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

ప్రజాశక్తి - ఆమదాలవలస

శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా, ప్రశాంత వాతావరణం నెలకొనేలా అందరూ సహకరించాలని డిఎస్‌పి వై.శృతి అన్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా వైసిపి, టిడిపి నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్‌లను బుధవారం పరిశీలించారు. ఆమదాలవలస పోలీస్ సర్కిల్ పరిధిలో కుద్దిరాం, ఐజె నాయుడు కాలనీ, దన్నానపేట, సరుబుజ్జిలి మండలం చిగురువలసలో పోలీస్ పికెట్‌లను పరిశీలించిన అనంతరం పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ ఎన్నికలు వస్తాయి, పోతాయని వాటి కోసం తగాదాల్లో తలదూర్చి కేసులతో జీవితాలను నాశనం చేసుకోవద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పెటగుళ్లకు పుట్టినిల్లు సిక్కోలు

(6లో)

రెసిడెన్షియల్ పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక

హరిణి సాహితీ నిహాంత్

పొందూరు: పొందూరు పట్టణంలోని మానసవేణి హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు జిల్లాలోని పలు రెసిడెన్సియల్ పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యారు. మంగళవారం విడుదలైన రెసిడెన్సియల్ పాఠశాల ప్రవేశ ఫలితాల్తో తమ ప్రతిభను చాటారు. పాఠశాలకు చెందిన వడగ హరిణి, పిన్నింటి సాహితిలు వమ్మరవెల్లి రెసిడెన్సియల్ పాఠశాలకు, కోరుకొండ నిహాంత్ ఎస్.ఎం.పురం రెడిసిడెన్సియల్ పాఠశాలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.కిషోర్ తెలిపారు.

అచ్చెన్నను కలిసిన గొండు శంకర్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

సన్మానిస్తున్న గొండు శంకర్

శ్రీకాకుళం నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన గొండు శంకర్ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడిని కలిశారు. మండలంలోని నిమ్మాడలోని అచ్చెన్న క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో పోలింగ్ తీరు, పార్టీ కేడర్ సహకారం, విజయ అవకాశలను వివరించారు. పోలింగ్ సమయంలో ఎదురైన అనుభవాలను చెప్పారు. సుమారు గంటన్నర సేపు ఇరువురు అంతరంగిక అంశాలపై చర్చించుకున్నారు. అంతకుముందు శాలువ కప్పి కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం కార్యదర్శిగా పని చేస్తూ ఇటీవల గుండెపోటుతో గొర్లె వెంకటరమణ మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష నగరంలోని మండల వీధిలోని మృతుడి కుటుంబాన్ని బుధవారం పరామర్శించి ఓదార్చారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎన్‌టిఆర్ అభిమానిగా సుదీర్ఘ కాలం పాటు టిడిపి సామాన్య కార్యకర్తగా చేరి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేసిన వెంకటరమణను పార్టీ కార్యాలయ కార్యదర్శిగా నియమించామన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. వీరి వెంట టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ ఉన్నారు.

పరామర్శిస్తున్న రవికుమార్, లక్ష్మీదేవి

తప్పెటగుళ్లకు పుట్టినిల్లు సిక్కోలు

- ఇతర రాష్ట్రాల్లో ప్రదర్శిస్తున్న వైనం
- ప్రభుత్వాలు ఆదుకుంటే మరింత ముందుకు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

గ్రామీణ ప్రాంతాల్లో యాదవులు ప్రదర్శించే తప్పెటగుళ్లు కొన్నేళ్లుగా చెక్కు చెదరకుండా ఈ కళారూపాన్ని కాపాడుకొచ్చారు. ప్రస్తుతం ఎక్కడో అరకొరగా కనిపిస్తుంటారు. ముఖ్యంగా పల్లెటూళ్లలో దేవుని సంబరాలు చేయాలంటే తప్పెటగుళ్లు తప్పనిసరి. తప్పెటగుళ్లను ప్రదర్శించే యాదవులు, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నారు. కానీ, చాలామంది ఆ కళకు దూరమై మేకలు, గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. విద్యకు దూరమై పొద్దంతా గొర్రెలను, మేకలను పొలాల్లోను, అడవుల్లోను మేపుకుని తీసుకెళ్తారు. కుటుంబాలకు దూరంగా, రాత్రి పూట మేకల, గొర్రెల మందలకు కాపలాకాస్తూ జీవనం సాగిస్తున్నారు. రాత్రి పూట మందల వద్ద గొర్రెలకు కాపలా కాస్తుంటారు. వీరు ఒంటరి తనాన్ని మరచిపోవడానికి వీరు నోట నుంచి అనేక రకాలైన పాటలు వస్తుంటాయి. ఈ తప్పెటగుళ్ల కళారూపం శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికి కనిపిస్తూ ఉంటుంది. పూర్వం వర్షాలు పడక రైతులు ఇబ్బందుల గురవుతున్న సందర్భంలో యాదవులకు చెందిన వారు పాటల రూపంలో దేవునికి కొలిచే తరుణంలో గుండెకు రేకుతో తయారు చేసిన ఒక చిన్న డప్పువంటి దానితో ధ్వనులు చేసేవారట. అలా కొంతకాలం తరువాత దానికి తప్పెటగుళ్ళు అని నామకరణం చేశారని పెద్దలు చెప్తున్నారు. ఆ కళ కొన్నేళ్లుగా ప్రాచుర్యం పొందిందని, ప్రస్తుతం అరొకరగా ప్రదర్శనలు ఇస్తున్నామని యాదవులు చెబుతున్నారు.

తప్పెటగుళ్లను ప్రదర్శించేటప్పుడు వీరు రంగు రంగుల బనియన్లు ధరిస్తారు. కాళ్లకు గజ్జెలు కట్టుకొని ఒకే విధమైన రంగు రంగుల నిక్కర్లను తొడిగి, లంగోటి లాంటి గోచీలను ధరించి, తప్పెటగుళ్లను వాయిస్తూ కేకలతో, అరుపులతో కేరింతలు కొడుతూ, ఆనందంగా గుండ్రంగా

జార్ఖండ్‌లోని జాతరలో ప్రదర్శిస్తున్న కరజాడ జట్టు (ఫైల్)

తిరుగుతూ శాస్త్రీయమైన అడుగులతో అందరూ గంతులేస్తూ, గెంతుతూ సుదీర్ఘ రాగాలతో ఆలాపన చేస్తూ తప్పెటలను కొడుతూ పాటలు పాడతారు. జట్టు నాయకుడే కీలకం. ఆయన మాట ప్రకారమే ప్రదర్శన జరుగుతుంది. లయబద్ధంగా నృత్యం చేసే ఈ బృందాల్లో 15 నుంచి 20 మంది వరకు ఉంటారు. తాళం, లయ తప్పకుండా, క్రమం తప్పకుండా వలయాకారంలో తిరుగుతూ వీరు చేసే నృత్యం కన్నులపండగగా ఉంటుంది. నెత్తిన చెంబు, కాళ్ల కింద పళ్లెం మాదిరి నీరు నింపిన మట్టి కుండ అంచులపై ఒకరు నిలబడితారు. అతనిపై మరొవాద్య కారుడు తప్పెటలను వాయిస్తూనే నీరు నిండిన కుండను నెత్తిన పెట్టుకుంటారు. ఒక పక్క తప్పెట వాయిస్తూ నీరు తొణికిపోతాయేమో అనే దృష్టి లేకుండా నృత్యం చేస్తూ ఉంటే ఆశ్చర్యం కలుగుతుంది. చదువు లేకపోయినా గుక్కపట్టి రాగాలు తీసి పాటలు పాడటం వారి ప్రత్యేకత. అది ఆ నాటి కళింగాంధ్రా దేశంలో ఉత్తమ కళారూపంగా వెలుగొందిన జానపద కళారూపం. ఉత్తరాంధ్ర దేశంలో పల్లెటూళ్లలో పల్లె ప్రజల పోషణతో సంరక్షింపబడుతూ ఉంది. ఏటా జరిగే దేవతల కొలువుల్లోనూ, జాతర్లలోనూ, పండగ రోజుల్లోనూ ఉత్సాహంగా ప్రదర్శిస్తూ ఉంటారు. తప్పెట గుళ్ళ జానపద సంగీత నాట్య దృశ్య రూపకం కాళ్లకు గజ్జెలు కట్టి ఒకేవిధమైన రంగుల నిక్కర్లను తొడిగి, కేకలతో రూపాలతో కేరింతాలు కొడుతుంటారు. ఆనందంతో వలయాకారంగా తిరుగుతారు. కట్టుదిట్టమైన, శాస్త్రీయమైన అడుగులతో అందరూ వంగుతూ, లేస్తూ, గెంతుతూ, సుదీర్ఘ రాగాలతో ఆలాపన చేస్తూ మృధు మధురమైన సంగీతంతో మధురంగా పాటలు పాడుతూ ప్రేక్షకులను రంజింప చేసే ఈ తప్పెటగుళ్ల కళను ఆదరిస్తారు. ఈ సాంప్రదాయ నృత్యం, వారు పాడే పాటలు వింటూ ఇప్పటికీ గ్రామీణ ప్రాంత వాసులు ఆనందంవెల్లుబుచ్చుతుంది. ఉత్తరాంధ్రలో మొదలైన ఈ సాంప్రదాయ కళ శ్రీకాకుళంలో ప్రసిద్ధి. మెళియాపుట్టి మండలంలోని చీపురుపల్లి, మర్రిపాడు-సి, మర్రిపాడు-కె, జలకలింగుపురం, చాపర, మాకనపల్లి, సంతలక్ష్మీపురం, కరజాడ గ్రామాల్లో ఇప్పటికీ ఈ కళను ప్రదర్శించే వారు ఉన్నారు. వీరు చుట్టు పక్కల మండలాల్లోనే కాకుండా జిల్లా స్థాయిలో కూడా పలు పండగలకు వెళ్లి ప్రదర్శనలు ఇస్తూ ఉంటారు. అదే కాకుండా కరజాడలోని కళాకారులకు ఇటీవల మంచి అవకాశాలు వచ్చాయి. ఇతర రాష్ట్రాలైన కోలకత్తా, ఒడిశా, జార్ఖండ్‌లోనూ ప్రదర్శనలు ఇచ్చారు. పలువురు అక్కడ కళాకారులను చాలా గౌరవప్రదంగా చూసుకున్నారు. కరజాడకు లోకనాథం, జగన్, జగన్నాథంలు మూడు జట్లుగా ఉన్నాయి. అందులో మర్రిపాడు-సి, చీపురుపల్లి, కరజాడ గ్రామాల్లోని కళాకారులకు మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఈ కళకు వందేళ్ల చరిత్ర ఉందని వారు చెబుతున్నారు. కానీ, వారికి ప్రభుత్వాలు గుర్తించడం లేదని పలువురు కళాకారులు అంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

25 ఏళ్లుగా 15 మందితో జట్టును ఏర్పాటు చేసుకుని అనేక కార్యక్రమాల్లో తప్పెటగుళ్ల కళను ప్రదర్శిస్తూ వస్తున్నాను. ఈ 25 ఏళ్లలో ఒక్క ప్రభుత్వమూ మమ్మల్ని గుర్తించి సహాయ, సహకారాలు అందించిన దాఖలాలు లేవు. ప్రభుత్వం స్పందించి సామగ్రి ఉచితంగా అందిస్తే మరింత గుర్తింపు ఉంటుంది.

- తలగాన కృష్ణారావు, జట్టు గురువు, మర్రిపాడు-సి

తాగునీరు సరఫరా చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

గొంతెండుతోంది... తాగునీరు ప్రజలకు అందించాలని మండలంలోని శ్రీనివాసాచార్యులపేట సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి తమ్మినేని శారద అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. గౌరీపతి మాట్లాడుతూ శ్రీనివాసాచార్యులపేటలో 450 ఇళ్లకు తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చినా సక్రమంగా తాగునీరు అందించడం లేదని, దీంతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి సమస్య పరిస్కారం కావాలంటే పెద్ద బోరు, ఓవర్ హెడ్ ట్యాంకును ఏర్పాటు చేసి నీరు అందిస్తేనే ప్రజలకు సక్రమంగా తాగునీరు అందుతుందని తెలిపారు. దీనిపై ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు మాట్లాడుతూ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే అక్కులపేట ఎంపిటిసి బొడ్డేపల్లి సుగుణ మాట్లాడుతూ అక్కులపేట నుంచి బొబ్బిలిపేటకు వెళ్లే బిటి రహదారిని నిర్మిస్తున్నారని అన్నారు. అయితే అక్కులపేట చివరి వరకు సిసి రహదారి ఉందన్నారు. అక్కడి నుంచి నిర్మిస్తున్న బిటి రహదారి లోతుగా ఉండటంతో ఈ మధ్య వర్షం పడినప్పుడు నీరు చేరి చెరువులా మారిందని అన్నారు. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు నానా ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. వంజంగిపేట సర్పంచ్ పైడి లక్ష్మి మాట్లాడుతూ తమ గ్రామంలోనూ తాగునీరు సమస్య ఉందని, వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, వైస్ ఎంపిపి సోమరాజు జగన్నాథం, మండల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీరామ్మూరి

డాక్టరేట్‌ను అందుకుంటున్న శ్రీనివాసరావు

శ్రీనివాసరావుకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి- సోంపేట

తల సేమియా వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తున్న సోంపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు, భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ అడ్వైయిజర్ దుద్ది శ్రీనివాసరావుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఢిల్లీలోని డిస్ప్రింగ్ ఇంటర్నేషనల్ క్రిస్టియన్ యూనివర్సిటీ యుఎస్ఎ నుంచి బుధవారం డాక్టరేట్‌ను అందుకున్నారు. తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు కొన్నేళ్లుగా సకాలంలో రక్తాన్ని అందజేస్తూ వారి ప్రాణాలకు బాసటగా శ్రీనివాసరావు నిలిచారు. ఆయన సేవలను గుర్తించి డాక్టరేట్‌ను అందజేశారు. దీంతో సోంపేట రోటరీ క్లబ్ సభ్యులతో పాటుగా వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తమ హర్షం వ్యక్తం చేశారు.

ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

స్నేహ 'హస్తం'

ప్రజాశక్తి- కవిటి

తమతో పాటు బాల్యంలో చదువుకున్న తోటి స్నేహితుడు అకాల మరణం చెందడంతో వారంతా కలత చెందారు. తమ స్నేహితుని కుటుంబ పరిస్థితి తెలుసుకుని అతని కుటుంబ సభ్యులకు అండగా నిలవాలని నిశ్చయించుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని మండలం బెలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-93 మధ్య చదువుకున్న కొజ్జిరికు చెందిన బి.నారాయణ మృతి చెందారు. విషయం తెలుసుకున్న అతనితో చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం నారాయణ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతేకాకుండా తమ వంతుగా రూ.46 వేలు ఆర్థిక సాయం అందించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయిస్తున్న కామేశ్వరరావు

బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ పరిధిలోని పొన్నాంపేటలో సర్పంచ్ ప్రతినిధి చల్లా కామేశ్వరరావు పాడైన తాగునీటి బోరుకు బుధవారం మరమ్మతులు చేయించారు. పొన్నాంపేటలోని బోరు గడచిన కొద్ది రోజులుగా పాడవ్వడంతో ప్రజలు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. వేసవిలో నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రథమ కర్తవ్యమని అన్నారు. గ్రామంలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే... తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాట్లాడుతున్న నాగరాజు

ఆలయ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని రంగి రాజువారి వీధిలో ఉన్న అంబాభవాని ఆలయ అభివృద్ధి కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అధ్యక్షులు సదరె నాగరాజు అధ్యక్షతన బుధవారం సభ్యులను ఎన్నికయ్యారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షునిగా బాయికర్ శ్రీనివాసరావు (రాజు), గౌరవ అధ్యక్షునిగా గుజ్జారు ఆనందప్రసాద్, డి.జనార్ధనరావు, సెక్రటరీగా పతంగే ఆనంద స్వరూప్ (నందు), జాయింట్ సెక్రటరీగా బి.చంద్రశేఖర్, ట్రెజరర్లుగా కంభాయతుఫర్, వి.వి.ఎస్.ఎస్ఎన్.కుమార్‌లు ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా పతంగే జోగరావు (ఆప్పో), కంభాయతుఫర్ విఠలరావు, భాయికర్ షన్ముఖరావు, భాసుటఫర్ సురేష్, కరారె జనార్ధనరావు, దేవత్రాసె సంతోష్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దాతలకు సన్మానం

ప్రజాశక్తి- రణస్థలం

స్థానికంగా ఉన్న ముత్యాలమ్మతల్లి 20వ వార్షికోత్సవం జాతర మహోత్సవాలు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో లావేరు మండలం కేశవరాయపురానికి చెందిన ఇనపకుర్తి పోతన్నదొరకు ఆలయ కమిటీ సభ్యులు ఆకెళ్ల సూరిబాబు, నెమలిపురి బాలరాజు, శనాపతి వరప్రసాదరావు, పుజారి పెంటమాని అప్పారావులు బుధవారం సన్మానించి, జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ 20 ఏళ్ల కిందట ఆలయానికి శంకుస్థాపన చేసి సొంత నిధులు, విరాళాలు సేకరించి ఆలయ నిర్మాణం, యాత్రికుల దాహార్తి తీర్చేందుకు బావి తవ్వించి సేవలు అందించారని అన్నారు. అలాగే ఆలయానికి యాత్రికులు రాకపోకలు సాగించేందుకు మండల వైస్ ఎంపిపి రాయపురెడ్డి భుజంగరావు రోడ్డు నిర్మించారు. ఆలయ ఆవరణలో విశ్రాంతి భవనం నిర్మాణం చేసిన జె.ఆర్.పురం ఎంపిటిసి ప్రతినిధి పచ్చిగుళ్ల సాయిరాంనూ సన్మానించారు.

సిసి రోడ్లకు నోచుకునేదెప్పుడు!

సిసి రోడ్డుకు నోచుకోని శివాజీ నగర్

ప్రజాశక్తి- పలాస

జిల్లాలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఒకటి. అటువంటి పట్టణంలో వీధులు ఏర్పడి ఏళ్ళు గడుస్తున్నా రోడ్లకు నోచుకోవడం లేదు. సిసి రోడ్లు నిర్మాణం చేపట్టాలని కోరినా ఫలితం శూన్యం. శివాజీ నగర్, సాయిబాబా ఆలయ సమీపంలో రెండు వైపులా ఉన్న వీధుల్లో సిసి రోడ్లు లేక ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు నడిచి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చాలా ప్రాంతాల్లో జనావాసాలు లేనిచోట సిసి రోడ్లు నిర్మాణం చేపట్టారు. పదేళ్లుగా ఇదే ప్రాంతంలో నివాసం ఉంటున్నా సిసి రోడ్లు ఎందుకు నిర్మాణం చేపట్టడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాంతంలో సిసి రోడ్లు నిర్మాణం చేపట్టాలని పదేపదే పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పాలకులు చొరవ చూపి ఆయా ప్రాంతాల్లో సిసి రోడ్లు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సిసి రోడ్డుకు నోచుకోని సాయిబాబా వీధి

మజ్జిగ పంపిణీ

మజ్జిగ పంపిణీ చేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని పూజారిపేటలోని నేతాజీ యూత్ సహకారంతో కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నెల రోజులుగా నిర్విరామంగా మజ్జిగను పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా కృత్విక్ ఫౌండేషన్ ఫౌండర్ సభ్యులు బుధవారం మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగాచిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) మాట్లాడుతూ ఏటా వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ నిత్యం కొనసాగుతుందని అన్నారు. భవిష్యత్‌లో కృత్విక్ ఫౌండేషన్ ద్వారా మరెన్నో కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతాజీ యూత్ సభ్యులు అశోక్, రామారావు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా చెత్తకుప్పలే



పేరుకుపోయిన చెత్తా చెదారం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రోజు రోజుకీ టెక్కలిలో చెత్త సమస్య పెరుగుతూ వస్తుంది. టెక్కలిలో పలు కూడళ్ల వద్ద, పలు వీధుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త రోజురోజుకీ పేరుకుపోతోంది. పేరుకే టెక్కలి మేజర్ పంచాయతీ. కానీ, ఇక్కడ చెత్త సమస్య అడుగడుగునా ప్రజలకు వేధిస్తుంది. రహదారి పక్కన, వీధుల వద్ద, పలు కూడళ్ల వద్ద ప్లాస్టిక్ కవర్లు, ఇంట్లో వినియోగించిన వ్యర్థపదార్థాలు పడేస్తున్నారు. దీంతో ఆ చెత్త నుంచి దుర్వాసనతో, దోమలతో, క్రిమి కీటకాలతో ఆ చుట్టు పక్కల ఉన్న ప్రజలు అవస్థపడుతూ అనారోగ్యానికి గురవుతున్నారు. పంచాయతీ అధికారులు దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రహదారులు గోతులమయం

పట్టణంలో కొన్ని ప్రధాన రహదారిలో మార్గం మధ్యలో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో అటువైపుగా వెళ్తున్న వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అనేక మంది ఆ రహదారిలో ఉన్న పెద్ద పెద్ద గుంతల్లో పడి గాయపడిన ఘటనలు ఉన్నాయి. ఎన్ని ప్రమాదాలు జరిగినా పట్టించుకునే వాళ్లే లేరని వాహనదారులు వాపోతున్నారు. ప్రభుత్వాలు ఎన్నిమారినా నూతన రోడ్డుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గతంలో వేసిన రోడ్ల నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో ఈ సమస్య వెంటాడుతుందని విమర్శిస్తున్నారు.

అధ్వానంగా ఉన్న రోడ్డు

శ్రీరాములు ఆశయాలను కొనసాగించాలి

పలాస : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పలాస

శ్రీరాములు ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం నాయకులు ఎన్.గణపతి అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం సిపిఎం ఆధ్వర్యాన బుధవారం సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉద్యమాలు జరిగే సమయంలో శ్రీరాముల పాత్ర కీలకమైందన్నారు. సిపిఎం పార్టీ బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ప్రజా సమస్యలపై పోరాటమే కాకుండా ప్రజల కోసం జైలు జీవితం గడిపారని అన్నారు. గిరిజన రైతాంగ ఉద్యమాల కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో ఢిల్లేశ్వరి, భాగ్యలక్ష్మి, ఉమామహేశ్వరరావు, గోరు భాస్కరరావులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ఈ నెల 17న నిర్వహించనున్న బమ్మిడి శ్రీరాములు సంస్కరణ సభను విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు పిలుపునిచ్చారు. సిపిఎం కార్యాలయంలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కొల్లి యల్లయ్య, హనుమంతు ఈశ్వరరావు, బగాది వాసుదేవరావు, ఉర్జాన లక్ష్మణరావు, అనపాన షణ్ముఖరావు, మెట్ట దాసు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : గిరిజన సంఘం ఉద్యమ నేత,

వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

టెక్కలి రూరల్ : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ మాజీ సభ్యులు బమ్మిడి శ్రీరాములు సంస్మరణ సభ ఈ నెల 17న నగరంపల్లిలో నిర్వహిస్తున్నామని సిపిఎం నాయకులు నెయ్యిల మోహనరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 6న శ్రీరాములు మృతి చెందారని అన్నారు. ఈ సభలో వామపక్ష, ప్రజాతంత్ర, ప్రజా సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.ఆనందరావు, టి.భాస్కరరావు, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

స్వీట్ తినిపిస్తున్న సర్పంచ్ భూషణ్‌రెడ్డి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని లక్ష్మీపురానికి చెందిన పెద్దిన భవాని ఎపిఆర్‌జెసి బైపిసి గ్రూపులో మంగళవారం విడుదలైన ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 53వ ర్యాంకు సాధించింది. ఈమె పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలోనూ 550 ర్యాంకు సాధించింది. అలాగే బడేనరసాపురానికి చెందిన చెందిన సుంకరి రజిత బైపిసి గ్రూపులో 143 ర్యాంకు సాధించింది. వీరికి సర్పంచ్ దుక్క భూషణ్‌రెడ్డి, షణ్ముఖ మాస్టర్, ఫాల్గుణరెడ్డి, సిమ్మన్న మాస్టార్లు బుధవారం మిఠాయిలు తినిపించి అభినందనలు తెలియజేశారు. చక్కని ఫలితాలకు కృషి చేసిన జైహనుమాన్ కోచింగ్ సెంటర్ శిక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి- కవిటి

గుర్తింపు కోసం ఇంకా ఎన్నేళ్లు నిరీక్షించాలని బెంతు ఒరియాలు ప్రశ్నించారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడంతో తమ బిడ్డలు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారని అన్నారు. నిరుద్యోగులు ఉద్యోగ అర్హత కోల్పోతున్నారని వాపోయారు. కూలీనాలీ చేసి బతుకుతున్న తమకు ప్రభుత్వ పథకాలు అందకుండాపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి పరిష్కారం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అందులో భాగంగా కవిటిలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 140వ రోజుకు చేరుకున్నాయి.

మినీ అంగన్వాడీలకు గుర్తింపు కరువు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర కీలకం. కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 186 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 35 వరకు మినీ అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. మెయిన్ అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తతో పాటు సహాయకులు విధులు నిర్వహిస్తారు. అంగన్వాడీ కార్యకర్త ప్రీ స్కూల్ పిల్లలను పాఠశాల విద్యకు సన్నద్ధం చేస్తారు. అందుకు అవసరమైన మెటీరియల్‌ను ఉదయం అంగన్వాడీ కేంద్రం తెరిచే ముందు సంబంధిత సూపర్ వైజర్ నుంచి తీసుకొని పిల్లలకు అభ్యాసన చేయిస్తారు. పాఠశాల విద్యకు అనుగుణంగా సిద్ధం చేస్తారు. ప్రీ స్కూల్ విద్యతో పాటు గర్భిణులకు, బాలింతలకు సంబంధించిన రికార్డులు నిర్వహణ బాధ్యతలూ చూస్తారు. అంగన్వాడీ సహాయలు ప్రీ స్కూల్ పిల్లలకు వంట చేయడం, ఆవరణ శుభ్రం చేయడం, తాగునీరు పెట్టడం, ఇళ్లకు వెళ్లి పిల్లలను కేంద్రానికి తీసుకు రావడం చేస్తారు. ఈ ఇద్దరు చేసే పని మినీ అంగన్వాడీ కార్యకర్తలు చేస్తారు. అయితే వారికి సరియైన గుర్తింపు లేదు. ఇద్దరు చేసే పనులను మినీ కార్యకర్త చేసినా సహాయకులు మాదిరిగానే వేతనాలు అందిస్తున్నారు. తెలంగాణలో మాదిరిగా మెయిన్ కార్యకర్తలుగా గుర్తించాలని కోరుతున్నా ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయి. ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవులు నడుస్తున్నాయి. కానీ, పాఠశాల పిల్లలు కంటే చిన్న వయసు పిల్లలు అయినా అంగన్వాడీలు ఏప్రిల్ 4 నుంచి ఒక్కపూటగా నడుపుతున్నారు. మెయిన్ కార్యకర్తలకు మే 1 నుంచి 15 వరకు సెలవలు, సహాయకులకు మే 16 నుంచి సెలవులు ఇస్తున్నారు. ఆ వెసులుబాటు మినీ కార్యకర్తలకు ఇవ్వడం లేదు. అలాగే మినీ అంగన్వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు లేక పాఠశాల వరండాలోనే ప్రీ స్కూల్ నడుపుతున్నారు. ఈ విషయమై కాశీబుగ్గ ఐసిడిఎస్ పిఒ డి.శార్వాణి మాట్లాడుతూ పిల్లలకు ఫీలింగ్ ఆగకూడదన్నారు. అందుకే వేసవిలోనూ కేంద్రాలను నడుపుతున్నామని అన్నారు. మినీ అంగన్వాడీ కార్యకర్తలకు సెలవులు లేకపోవడం కొంత ఇబ్బందేని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు నిర్వహణలో సహకరిస్తున్నామని తెలిపారు. ఏవైనా అత్యవసర అవసరాలు ఉంటే తప్ప కేంద్రాలను వేసవిలోనూ నడపాల్సిందేని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు మూయడానికి లేదని స్పష్టం చేశారు.

సీతాపురంలో నిర్వహిస్తున్న మినీ అంగన్వాడీ కేంద్రం